సాక్షి
నల్లగొండ
శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



దివ్యవిమాన రథంపై.. యాదాద్రిలోని శ్రీపూర్వగిరి ఆలయంలో స్వామి వారు శుక్రవారం రాత్రి దివ్యవిమాన రథంపై ఊరేగారు. - 8లో



వనదేవతలకు మొక్కులు ఉమ్మడి జిల్లాలోని చిన్న మేడారాల్లో కొలువుదీరిన వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. - 8లో



దారితప్పి జనారణ్యంలోకి.. నాగార్జునసాగర్ కోర్ ఏరియాలో వదిలిన జింకలు జనారణ్యంలోకి వచ్చి వీధికుక్కల బారిన పడుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీ ప్రారంభం

నల్లగొండ : ఆసరా పింఛన్ల పంపిణీ ప్రారంభమైందని డీఆర్‌డీఓ నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు పోస్టాఫీస్‌లలో పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పింఛను మొత్తాన్ని నేరుగా పోస్టల్ శాఖ నుంచి పొందాలని దళారులను నమ్మవద్దని పేర్కొన్నారు. రూ.16 కూడా అడిగి తీసుకోవాలని.. చిల్లర ఇవ్వక పోతే డీఆర్‌డీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



బట్లపల్లిలో పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

మర్రిగూడ : మండలంలోని వట్టిపల్లి పరిధిలోని బట్లపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనులను శుక్రవారం డీఆర్‌డీఓ నాగిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. కూలి రూ.190 వస్తుందని కూలీలు చెప్పగా రూ.272 వచ్చే విధంగా పని చేయాలని సూచించారు. జిల్లాలోని 844 గ్రామపంచాయతీల్లో వంద మంది చొప్పున కూలీలు పనులను పొందాలన్నారు. అందుకు అనుగుణంగా ప్రతి గ్రామంలో 300 పనులను గుర్తించాలన్నారు. ప్రతి కూలీకి ఆధార్ అనుసంధానం చేసి ఆధార్ బేస్డ్ పేమెంట్ చేస్తామన్నారు. ఆయన వెంట ఏపీడీ నవీన్, ఎంపీడీఓ చినమునయ్య, ఏపీఓ గుంటుక వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి అక్షిత్, భిక్షమయ్య ఉన్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నల్లగొండ : మార్చి 18వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈఓ భిక్షపతి తెలిపారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ హైస్కూల్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, ప్రశ్నపత్రాల కస్టోడియన్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు 19,715 మంది విద్యార్థులు హాజరుకానున్నారని.. 109 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటుందని.. జనరల్ సైన్స్ పేపర్లు 1, 2 మాత్రం 9.30 గంటల నుంచి 11.00 గంటల వరకే ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షల్లో పాత బార్ కోడ్ పద్ధతిని అవలంబిస్తామన్నారు. సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ



అమ్మవారి సేవను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారిక సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్టించి ఊంజలి సేవ నిర్వహించారు. అలాగే ప్రధానాలయంలో సుప్రభాత సేవ, అభిషేకం, అర్చనలు, సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం తదితర కైంకర్యాలు గావించారు.

శాస్త్రోక్తంగా నారసింహుడి కల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పవర్ ప్లాంట్‌కు ముగ్గురు మంత్రులు



మిర్యాలగూడ అర్బన్ : దామరచర్ల మండలంలోని వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం పరిశీలించనున్నారు. ఉదయం 9.45 గంటలకు వారు హెలికాప్టర్‌లో ప్లాంట్ వద్దకు చేరుకుంటారు. పవర్‌ప్లాంట్ పనుల తీరును పరిశీలించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించున్నారు. అక్కడి నుంచి ఉదయం 11.15 గంటలకు హుజూర్‌నగర్‌కు వెళ్తారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మంత్రుల పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇంటర్ పరీక్షలకు 50 కేంద్రాలు



మాట్లాడుతున్న డీఐఈఓ దస్రూనాయక్

నల్లగొండ : ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఐఈఓ దస్రూనాయక్ తెలిపారు. శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పరీక్షలకు చైర్మన్‌గా కలెక్టర్, మెంబర్‌గా ఎస్పీ వ్యవహరిస్తారని తెలిపారు. పరీక్షలకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, నాలుగు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేసామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్ష సమయాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఒత్తిడికి గురైతే టోల్‌ఫ్రీ నంబర్ (14416)ను సంప్రదించాలని సూచించారు.

మార్కెటింగ్ ఇంటలిజెన్స్ అధికారుల తనిఖీలు



సమావేశమైన ఇంటలిజెన్స్ అధికారులు

నల్లగొండ : కేంద్ర వ్యవసాయ శాఖలోని ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ మూల్యాంకన విభాగం పరిధిలో పనిచేసే రాష్ట్రస్థాయి మార్కెటింగ్ ఇంటలిజెన్స్ అధికారులు శుక్రవారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని రామ్‌లక్ష్మణ్ మిల్లులో ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశమయ్యారు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఏ విధంగా ఉన్నాయి.. అవి భవిష్యత్‌లో ఏ విధంగా ఉండబోతున్నాయి అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ వివరాలను వారు కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వరరావు, మార్కెటింగ్ ఏడీ శ్రీకాంత్, మిల్లర్లు పాల్గొన్నారు.

నచ్చినోళ్లకే కాంట్రాక్ట్!

విద్యుత్ శాఖ స్టోర్‌లో అధికారుల ఇష్టారాజ్యం

- ఏళ్ల తరబడి కొద్దిమందికే పరికరాల తయారీ పనుల అప్పగింత
- వారికి అనుకూలంగా నిబంధనలు మారుస్తున్న జిల్లా అధికారులు
- అప్పగించిన వర్క్ పూర్తికానున్నా.. తిరిగి వారికే పనులు
- 20 ఏళ్లుగా కొత్త కాంట్రాక్టర్లకు దక్కని అవకాశం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : విద్యుత్ శాఖ స్టోర్‌లో జిల్లాస్థాయి అధికారుల ఇష్టారాజ్యం సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. ఏళ్లతరబడి కొందరు కాంట్రాక్టర్లే స్టోర్ లోపల పరికరాలు తయారు చేసే కాంట్రాక్టు పొందుతున్నారు. అధికారులు కూడా వారికి అనుకూలంగా నిబంధనలు రూపొందిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. దీనివల్ల 20 ఏళ్లుగా కొత్త కాంట్రాక్టర్లకు అవకాశం దక్కడం లేదని తెలుస్తోంది.

పని పూర్తయ్యాకే తిరిగి ఇవ్వాలని నిబంధన

విద్యుత్ శాఖ స్టోర్‌లో ఐరన్ పరికరాలు తయారు చేసేందుకు టెండర్ ప్రాతిపదికన కాంట్రాక్ట్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ఏ కాంట్రాక్టర్ అయితే పనిని దక్కించుకుంటారో ఆ పని పూర్తయిన తర్వాతే అందులో తిరిగి కొత్త పనిని ఆ కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. కానీ జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారి, సంబంధిత స్టోర్ అధికారులు.. కాంట్రాక్టర్లతో కలిసిపోవడంతో పాత పనులు పూర్తి కాకున్నా వారికే కొత్త పనులు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 14 ఏళ్ల క్రితం ఓ కాంట్రాక్టర్ 90 శాతం లెస్‌తో ఓ పనిని దక్కించుకుని స్టోర్‌లోకి ఎంటర్ అయ్యాడు. ఇప్పటి వరకు ఆ పని పూర్తికాకున్నా.. సదరు కాంట్రాక్టర్‌కు పనులు ఇస్తున్నారని తెలిసింది. అధికారులు కొత్త వారికి అవకాశం లేకుండా నిబంధనలు రూపొందిస్తూ వాటిని టెండర్లలో పొందుపరచడం వల్ల కొత్త కంట్రాక్టర్లు స్టోర్ పనులను దక్కించుకోలేకపోతున్నారని తెలుస్తోంది.

మిగిలిన కేబుల్ బయటకి పంపి..

ఇటీవల స్టోర్‌లో రెండు డ్రమ్ముల కేబుల్ మిగిలిందని ఓ అధికారి బయటికి పంపించినట్లు సమాచారం. అయితే అన్ని లెక్కలు చూసిన ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కేబుల్ మిగల్లేదని చెప్పడంతో.. తిరిగి ఆ వైర్‌ను స్టోర్‌లోకి తెచ్చినట్లు తెలిసింది. ఈ విషయంలో సదరు ఉద్యోగిపై కక్షగట్టి అతడే ఆ కేబుల్‌ను అమ్ముకున్నాడని ఆరోపణలు చేసి ఉద్యోగంలో నుంచి తీసివేసినట్లుగా సమాచారం. ఇక్కడ కరెక్ట్‌గా లెక్క చేసిన ఉద్యోగిపైనే వేటు వేయడం గమనార్హం.

స్టోర్‌లో ప్రతి పనికి ఓ రేటు..

ఇక స్టోర్‌లో ప్రతి పనికి ఓ రేటుకట్టి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. వందశాతం పేమెంట్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైతే ఒక్కో దానికి రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. టీఅండ్‌డీ ద్వారా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చి వారి వద్ద కూడా రూ.2 వేల పైచిలుకు తీసుకుంటున్నారని సమాచారం. వీరితో పాటు ఆన్‌లైన్ నమోదు చేసే వ్యక్తి, వాచ్‌మెన్‌కు కూడా అంతోఇంతో ముట్టజెప్పాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారి కనుసన్నల్లో ఈ తతంగం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర స్థాయి సీఎండీ, ఇతర ఉన్నతాధికారులు స్టోర్‌ను నెల వారీగా తనిఖీ చేయకపోవడం వల్లే ఇక్కడ అధికారుల ఇష్టారాజ్యం సాగుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించని పక్షంలో సంస్థ నష్టపోవడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడే అవకాశం ఉంది.

పోలియో చుక్కలు వేయించాలి

- కలెక్టర్ హరిచందన



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : ఐదు సంవత్సరాల్లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ దాసరి హరిచందన పేర్కొన్నారు. పల్స్ పోలియో నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తామన్నారు. 3వ తేదీన పోలియో చుక్కలు వేయించుకోలేని వారికి 4, 5 తేదీల్లో పల్స్ పోలియో బృందాలు ఇంటింటికి తిరిగి చుక్కలు వేస్తారని తెలిపారు. జిల్లాలో 1,54,895 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని.. వారందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. పోలియో చుక్కలు వేసేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 1070 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, 4280 పల్స్ పోలియో బృందాలను, 107 మంది సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఫ్యాక్టరీల్లో పనిచేసే వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి జమీర్, సర్వేలేన్స్ మెడికల్ అధికారి ప్రశాంత్, జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించాలి



మొక్క నాటుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ : విద్యార్థులు జీవితంతో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ హరిచందన సూచించారు. శుక్రవారం నల్లగొండలోని గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి ప్రేరణ తరగతులకు ఆమె హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి తన బలాన్ని, బలహీనతలను విశ్లేషించుకుని పరీక్షల్లో మార్కులను ఎలా పెంచుకోవాలో ఆలోచించాలని చెప్పారు. విద్యార్థులు జీవిత లక్ష్యంతో పాటు, పరీక్షల లక్ష్యాన్ని సైతం నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. వార్తాపత్రికలను చదవడం అలవాటుగా చేసుకోవాలని, జనరల్ నాలెడ్జ్ పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వసతి గృహంలో మొక్క నాటారు. కార్యక్రమంలో హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, ఏడీడబ్ల్యూఓ లక్ష్మారెడ్డి, హాస్టల్లో వెల్ఫేర్ అధికారి రామకృష్ణ, హనుమాక్షి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే అభివృద్ధి సాధ్యం



చేనేత కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

- బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు

చండూరు : తెలంగాణ అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 12సీట్లలో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం నల్లగొండ జిల్లా చండూరులో ఆ పార్టీ నాయకులు చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్, కమ్యూనిస్టుల పాలనలో అభివృద్ధికి నోచుకోలేదని, కోమటిరెడ్డి బ్రదర్స్ అభివృద్ధిని గాలికొదిలి గుత్తాధిపత్యం కోసం హద్దులు దాటి మాట్లాడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలోని డిగ్రీ కళాశాలల ఏర్పాటు, రిజర్వాయర్ల పూర్తి, చేతి వృత్తుదారులను కాపాడుకోవడం వంటి కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పాత వారిపైన విమర్శలకు ఎక్కువ సమయం ఇస్తున్నారని, ఆరు గ్యారంటీల అమలను విస్మరిస్తున్నారని అన్నారు.

మోదీ ఆధ్వర్యంలో దేశాభివృద్ధి

- కామారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, రాకేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మర్రిగూడ : కేంద్రంలో బీజేపీ గెలిపిస్తేనే మోదీ ఆధ్వర్యంలో దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బీజేపీ విజయసంకల్ప యాత్ర శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణాలో ఎంపీ సీట్ల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో దేశం పురోగతి చెందిందని, భవిష్యత్ బంగారమయం కావాలంటే మళ్లీ బీజేపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, దూడల భిక్షం, దోనూరు వీరారెడ్డి, ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, గుండగోని భరత్, జిల్లా ఉపాధ్యక్షుడు కోమటి వీరేశం, మండల అధ్యక్షులు కాసాల జనార్దన్‌రెడ్డి, దర్శనం వేణు, బొబ్బల మనోహర్‌రెడ్డి, మేకల దర్శన్‌రెడ్డి, చిలుకూరి అశోక్, రావిరాల శ్రీను, సోమ నరసింహ, పిన్నింటి నరేందర్ రెడ్డి, శ్రీహరి, గ్యార గోపాల్, రాజేందర్‌నాయక్, జిల్లా కిశోర్, పంగా యాదయ్య, గ్యార యాదగిరి, పగిళ్ల లింగస్వామి, నర్ర పరమేష్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ కమిటీకి శిక్షణ

నల్లగొండ : ఎన్నికల వ్యయ నిర్వహణ కమిటీ సభ్యులకు శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి కిరణ్ కుమార్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, అధిక మొత్తంలో డబ్బు దొరికిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. అభ్యర్థుల వ్యయానికి సంబంధించి రిజిస్టర్ల నిర్వహణ, ఆదాయ, వాణిజ్య పన్ను, కో ఆపరేటివ్, లీడ్ బ్యాంక్, ఎక్సైజ్, ట్రాన్స్‌కో, పోలీస్, ట్రెజరీ, ప్లానింగ్ అధికారులతో కలిసి పని చేయాలని సూచించారు. అనంతరం జిల్లా పౌర సంబంధాల అధికారి వెంకటేశ్వర్లు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ విధులు, వ్యయ నిర్వహణ ప్రకటనలు జారీ, అనుమతులు, మీడియాలో ప్రసారమయ్యే న్యూస్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ నోడల్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, ఎస్‌ఐసీ అధికారి గణపతిరావు, ఎంసీఎంసీ సభ్యులు శేషాచార్యులు, మాస్టర్ ట్రైనర్ పరమేష్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన వ్యక్తి అరెస్టు

నల్లగొండ క్రైం : పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన నిందితుడిని టాస్క్‌ఫోర్స్, నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ చందనా దీప్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్కట్‌పల్లి పరిధిలోని ధనలక్ష్మి రైస్ మిల్లు ఎదురుగా దోసపాటి వేణు తన ఇంట్లో అక్రమంగా 43 బస్తాల్లో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచాడని తెలిపారు. పోలీసులు తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని.. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

మెడికల్ కళాశాలలో తనిఖీలు

నల్లగొండ టౌన్ : నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాలలను అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఇటీవల వెలుగులోకి వచ్చిన అవినీతి ఆరోపణలపై కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి, సూపరింటెండెంట్ నిత్యానందంను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీనిపై పూర్తి వివరాల కోసం ప్రయత్నించగా ఆసుపత్రి అధికారులు స్పందించలేదు.

రైతులపై దమనకాండను నిలిపివేయాలి



నల్ల బ్యానర్‌తో నిరసన తెలుపుతున్న నాయకులు

నల్లగొండ టౌన్ : రైతులపై కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న దమనకాండను నిరసిస్తూ సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాక్‌డే నిర్వహించారు. నల్లగొండలోని సుభాష్ విగ్రహం వద్ద నల్ల బ్యానర్‌తో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం, రైతు సంఘం జిల్లా నాయకుడు కుంభం కృష్ణారెడ్డి మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరుతున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పోలే సత్యనారాయణ, భిక్షం, బొల్లు రవీందర్‌కుమార్, సలువోజు సైదాచారి, గద్దం రాములు, కళ్లెం బుచ్చిరెడ్డి, మల్లేపల్లి రాంబాబు, వడ్డే రవి, చెరుపల్లి శివమ్మ, పాలకూరి అండాలు, పోలే వెంకన్న, ఎల్లయ్య, రమేష్, ఈర్ల మారయ్య, సల్లోజు విష్ణుమూర్తి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

పది నెలలుగా అందని టీఏ, డీఏ




నల్లగొండ : గతేడాది ఏప్రిల్ నెలలో పదో తరగతి పరీక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు పది నెలలుగా టీఏ, డీఏ అందం లేదు. జిల్లాలో చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్లు మొత్తం 964 మంది పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొన్నారు. ఇందుకు వారికి రెమ్యునరేషన్, టీఏ, డీఏ ఇవ్వాల్సి ఉంది. మూల్యాంకనం పూర్తయ్యాక రెమ్యూరేషన్ మాత్రమే ఇచ్చారు. టీఏ, డీఏ ఇవ్వలేదు. ఆ మొత్తం దాదాపు రూ.19.50 లక్షల చెల్లించాల్సి ఉంది. పదో తరగతి పరీక్షలు మళ్లీ దగ్గర పడుతున్నాయి. కానీ అప్పటి బకాయిలపై అధికారులు నోరెత్తడం లేదు.

సొంత ఖర్చులతో మూల్యాంకన కేంద్రానికి..

జిల్లా వ్యాప్తంగా సబ్జెక్టు టీచర్లను మూల్యాంకనానికి ఉపయోగించారు. వారు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నల్లగొండలోని మూల్యాంకన కేంద్రానికి రోజూ వచ్చారు. రవాణా, ఇతర ఖర్చులు వారే బరించారు. వారికి వెంటనే టీఏ, డీఏ ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఇవ్వక పోవడంతో వారంతా నిరాశగా ఉన్నారు. వెంటనే టీఏ, డీఏ చెల్లించాలని కోరుతున్నారు.

అప్పుడు సేఫ్..



ఈ నెల 13న నల్లగొండలో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో వేదికపై కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత (రెడ్ శారీ) - నల్లగొండ రూరల్



నల్లగొండ సభకు హాజరై తిరిగి వెళ్తున్న సమయంలో చర్లపల్లి వద్ద లాస్యనందిత కారు ప్రమాదానికి గురికాగా.. ఆమెకు ఏమీకాలేదు. ముందుభాగం దెబ్బతిన్న కారు నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉంది.

క్లుప్తంగా

వంట గ్యాస్ సిలిండర్‌లో నీరు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో వంట గ్యాస్ సిలిండర్ నుంచి నీరు వచ్చింది. గ్రామానికి చెందిన కూరాకుల లక్ష్మి శుక్రవారం వంట చేస్తుండగా.. కొంతమేరకు గ్యాస్ వచ్చి మంట ఆగిపోయింది. ఆ సిలిండర్‌ను పరిశీలించగా అందులో నుంచి నీరు రావడం గమనించింది. సరఫరా చేస్తున్న గ్యాస్ సిలిండర్ తూకం తక్కువ రావడంతోపాటు, సిలిండర్‌లో నీరు కలిసి వస్తుందని ఆరోపించింది. సంబంధిత గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతోంది.

వనదేవతలకు మొక్కులు



రాజాపేట: చిన్నమేడారం జాతరకు హాజరైన జనం

- వైభవంగా కొనసాగుతున్న చిన్న మేడారం జాతర

రాజాపేట: మండలంలోని చిన్నమేడారం, చల్లూరు యాదాద్రి మేడారాల్లో కొలువుదీరిన వనదేవతలకు శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ బోనాలతో ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పరిసర వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవార్లకు వడిబియ్యాలు, గాజులు, పసుపు, కుంకుమ, వస్త్రాలు, తలనీలాలు సమర్పించుకున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) తూకంవేసి అమ్మవారికి నైవేద్యంగా అర్పించారు. గద్దెల చుట్టూ ప్రదక్షిణలు చేసి వరం పట్టి ముడుపులు చెల్లించుకున్నారు. శనివారం సమ్మక్క-సారలమ్మ దేవతల వనప్రవేశం నిర్వహించడంతో జాతర ముగియనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గద్దెకు చేరిన పగిడిద్దరాజు

పెద్దవూర: మండలంలోని పొట్టిచల్మ ఎక్స్‌రోడ్డు వద్ద కృష్ణా నది సమీపంలో చిన్న మేడారం వద్ద సమ్మక్క-సారలమ్మ జాతర మూడోరోజు కొనసాగింది. శుక్రవారం వేకువజామున ప్రధాన పూజారులు డప్పు వాయిద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి పగిడిద్దరాజును గద్దెకు చేర్చారు. సమీప గ్రామాల ప్రజలు వనదేవతలను దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారులు, ధర్మకర్తలు గుంజ అంజమ్మ, గుంజ కృష్ణంరాజు, నాగపురి లక్ష్మి పాల్గొన్నారు.



పెద్దవూర: వనదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు

పోటెత్తిన భక్తజనం

పెన్‌పహాడ్: మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో శ్రీసమక్క-సారలమ్మ జాతర శుక్రవారం మూడో రోజు వైభవంగా కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బంగారం (బెల్లం) సమర్పించారు. నాగుపాము పుట్ట వద్ద పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ బండి ధనమ్మరామకృష్ణారెడ్డి, బండి మధుసూదన్‌రెడ్డి, మామిడి వెంకన్న, వాంకుడోతు జ్యోతి, ప్రభాకర్ రెడ్డి, శ్రీరాములు, వెంకట్‌రెడ్డి, గోపయ్య, రామచంద్రు, పాపయ్య, బేగం జాన్‌షా, జానయ్య దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కోలాటం వేస్తున్న మహిళలు

దివ్యవిమాన రథంపై నారసింహుడు



గరుడ వాహన సేవను ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు, పాల్గొన్న ఈఓ రామకృష్ణారావు, అధికారులు

- పూర్వగిరిలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు
- గరుడ వాహనంపై ఊరేగిన శ్రీస్వామి వారు

యాదగిరిగుట్ట: శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారు గరుడ వాహనంపై ఊరేగారు. రాత్రి దివ్యవిమాన రథంపై తిరువీధుల్లో విహరించారు. ఆలయంలో నిత్య ఆరాధనల అనంతరం ఆలయ ప్రధానార్చకులు, యాజ్ఞాచార్యులు, అర్చక బృందం, వేదపండితులు, పారాయణీకులు చతుర్వేద పారాయణములు, నిత్య హవనం, మూలమంత్ర, మూర్తి మంత్ర జపములు, లక్ష్మీ అష్టోత్తర నామ జపములు నిర్వహించారు. కల్యాణ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి, గరుడ వాహన సేవలో తిరువీధిలో ఊరేగించారు. ఇక సాయంత్రం రథాంగ హోమం, రథబలి వేడుకలను ఆగమ శాస్త్రానుసారంగా జరిపించారు. ఉదయం, సాయంత్రం జరిగిన వేడుకల్లో ఈఓ రామకృష్ణరావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చక బృందం పాల్గొన్నారు.

పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు

రథోత్సవంలో యువత, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రథోత్సవం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మల్లాపురానికి చెందిన శ్రీరామ భక్త భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీగాయత్రి మహిళ భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఇక హైదరాబాద్‌కు చెందిన డీఎస్ శ్రీదేవి భక్తి సంగీతం నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక విశ్వ కళా మండలి రాంపల్లి వారిచే నృత్య ప్రదర్శన జరిగింది.



గరుడ వాహనంపై శ్రీస్వామి అమ్మవార్లు

నేడు చక్రతీర్థం

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో ఉదయం 9గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 12గంటలకు చక్రతీర్థం, సాయంత్రం 5గంటలకు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, డోలారోహణం నిర్వహించనున్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహన

నల్లగొండ రూరల్: మహాత్మా గాంధీ యూనివర్సిటీలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు జాతీయ సేవా పథకం ప్రాధాన్యతపై అధ్యాపకుడు ఆకుల రవి అవగాహన కల్పించారు. సమాజంలో సాంకేతిక మార్పులు, ప్రజల దైనందిన జీవన శైలి, పర్యావరణం, నీటి కాలుష్యంపై వివరించారు. కార్యక్రమంలో సతీష్, మద్దిలేటి, రమణారెడ్డి, శేఖర్, స్వప్న పాల్గొన్నారు.

ఎంజీయూ కామర్స్ ప్రిన్సిపాల్‌గా ఎంవీఎన్ రెడ్డి

నల్లగొండ రూరల్: మహాత్మా గాంధీ యూనివర్సిటీ కామర్స్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎంవీఎన్ రెడ్డిని నియమిస్తూ రిజిస్ట్రార్ అల్వాల రవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సహచర అధ్యాపకులు ఎంవీఎన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

యూనివర్సిటీలో కరపత్రాల కలకలం

- 'నిరుద్యోగ విద్యార్థి రాడికల్స్' పేరిట కరపత్రాలు

నల్లగొండ రూరల్ (ఎంజీ యూనివర్సిటీ): మహాత్మా గాంధీ యూనివర్సిటీలో శుక్రవారం 'నిరుద్యోగ విద్యార్థి రాడికల్స్' పేరిట వెలిసిన కరపత్రాలు కలకలం రేపాయి. 'అవినీతి సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారావని.. యూనివర్సిటీలో చీకటి వ్యాపారానికి తెరలేపావని' యూనివర్సిటీ వీసీని దూషిస్తూ కరపత్రంలో పేర్కొన్నారు. అవినీతి అధికారులంతా తప్పు ఒప్పుకుని విధుల నుంచి వైదొలగాలని హెచ్చరించారు. 31 మంది అవినీతి మార్గంలో ఉద్యోగాలు పొందారని, నిరుద్యోగులకు మోసం చేశారని, యూనివర్సిటీకి చెడ్డ పేరు తీసుకొచ్చారని అందులో పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రాణాలకు తెగించి తెలంగాణ కోసం బలైన నిరుద్యోగులు గుర్తుకు రాలేదా.. అని మాజీ మంత్రి పేరును కూడా కరపత్రంలో ప్రస్తావించారు.

నిరాధారమైన ఆరోపణలు - ఎంజీయూ వీసీ

కరపత్రాల్లో ఉన్న అంశాలన్నీ పూర్తిగా నిరాధారమైనవని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తనకు రియల్ ఎస్టేట్‌లో వ్యాపారాలు లేవని, యూనివర్సిటీలో ఎలాంటి అవినీతి జరగలేదని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను అడగవచ్చని పేర్కొన్నారు.

గంజాయి విక్రయించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన కేసులో వ్యక్తికి మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు కోర్టు జడ్జి బి.తిరుపతి శుక్రవారం తీర్పునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా పెద్దపురానికి చెందిన నందం సురేష్ గంజాయి విక్రయించడం వృత్తిగా ఎంచుకున్నాడు. 2022 ఏప్రిల్ 21న నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్డులో ఓ పెట్రోల్ బంకు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. అప్పటి సీఐ వి.వెంకటేశ్వర్‌రెడ్డి సిబ్బందితో కలిసి బంకు వద్ద అనుమానాస్పదంగా ఉన్న సురేష్ అదుపులోకి తీసుకోగా అతని వద్ద 1.9 కిలోల గంజాయి పట్టుపడింది. అతడిని రిమాండ్ చేసి కోర్టుకు తరలించారు. ఎస్సై రోజ చార్జ్‌షీట్ నమోదు చేసి విచారణ చేయగా నల్లగొండ చుట్టుపక్కల ఉన్న యువతను లక్ష్యంగా ఎంచుకుని గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరిగిరి వెంకట్‌రెడ్డి వాదనలతో ఏకీభవించిన మొదటి అదనపు కోర్టు జడ్జి నిందితుడికి 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళా రైతు ఆత్మహత్యాయత్నం



తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ మీద పోసుకొని ఆందోళన చేస్తున్న మహిళా రైతు

గుండాల : వ్యవసాయ భూమి తనకు దక్కకుండా పోతుందని ఆందోళన చెందిన మహిళా రైతు తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కాటబోయిన వెంకటయ్యకు ముగ్గురు కూతుళ్లు ఉండగా.. వారందరి పెళ్లిల్లు అయ్యాయి. రెండో కూతురు రామక్క తన భర్తతో కలిసి పెళ్లి అయినప్పటి నుంచి వెంకటయ్య వద్దే ఉంటున్నది. చిన్న కూతురు మరణించగా పెద్ద కూతురు సోమక్క తన భర్తతో గొడవలు జరిగి.. ఆమె కూడా తండ్రి వెంకటయ్య వద్ద ఉంటున్నది. అయితే, వెంకటయ్య పేరు మీద ఉన్న 11 ఎకరాల భూమిని పెద్ద కూతురు సోమక్క తన పేరు మీద పట్టా చేయించుకుంది. ఆ తర్వాత అందులో నుంచి ఏడు ఎకరాల భూమిని చెల్లులు రామక్క కుమారుడైన సంగి స్వామికి పట్టా చేశారు. మిగతా 4 ఎకరాల భూమిని వెంకటయ్య మూడో కూతరు లక్ష్మమ్మ మనమరాలైన అశ్వినికి ఇచ్చేందుకు ఇటీవల ఒప్పందం కుదిరింది. అశ్విని ఆ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకునేందుకు సిద్ధమైంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు శనివారం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంగి స్వామి భార్య సంగి సుమలత (రామక్క కోడలు) ఆ భూమి తమకే కావాలంటూ తన భర్తపై రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ తహసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యా యత్నం చేసుంది. ఇది గమనించిన రెవెన్యూ సిబ్బంది కార్యాలయంలో ఉన్న ఇతర వ్యక్తులు వారిని వారించి పెట్రోల్ డబ్బాను తీసేసుకున్నారు.

వివరాలు తెలుసుకుని పరిష్కరిస్తాం..

మహిళా రైతు ఆందోళన మేరకు రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేసినట్లు తహసీల్దార్ జలకుమారి తెలిపారు. గ్రామానికి వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

రామగిరి(నల్లగొండ): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిప్పర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని గడ్డికొండారం గ్రామానికి చెందిన కస్పరాజు నవీన్(27) తిప్పర్తి మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మూడు సంవత్సరాల క్రితం కాజీరామారం గ్రామానికి చెందిన శివానితో వివాహమైంది. నవీన్ తనకున్న 5 ఎకరాల భూమితోపాటు మరో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అప్పుచేసి పెట్టుబడి పెట్టాడు. ఈసారి బోర్లు సరిగా పోయకపోవడంతో వేసిన పంట అంతా ఎండిపోయింది. దీంతో మనస్తాపం చెందిన నవీన్ శుక్రవారం ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లి తిప్పర్తి పంప్‌హౌస్ వద్ద మెట్లకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

నేడు వజ్రతేజ రైస్ మిల్లులో చిరంజీవి సినిమా షూటింగ్

హాలియా: ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు, మెగాస్టార్ చిరంజీవి నటించనున్న విశ్వంబర సినిమా షూటింగ్‌ను శనివారం హాలియా పట్టణంలోని వజ్రతేజ రైస్ మిల్లులో నిర్వహించనున్నారు. ఇప్పటికే వారు షూటింగ్‌కు సంబంధించి మిల్లు యాజమాన్యం అనుమతి తీసుకున్నారు. యూవీ క్రియేషన్ బ్యానర్‌పై నిర్మించనున్న సినిమాలో చిరంజీవి, రాజా రవీంద్ర, హర్షవర్ధన్, వెన్నెల కిశోర్, చమ్మక్ చంద్ర, ప్రవీన్, రోహన్, అకుల్, కుసుం, ప్రత్యూష సింగంశెట్టి, నాగరాజు, రాహుల్‌లపై సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. మిల్లులోని 10 ధాన్యం లోడ్లతో ఉన్న ట్రాక్టర్లు, మిల్లు ఆవరణలో సన్నివేశాలు తీయనున్నట్లు సమాచారం. ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు సినిమా షూటింగ్ నిర్వహించనున్నారు. చిరంజీవి సినిమా షూటింగ్ కావడంతో అభిమానులు పెద్దఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున డీఎస్పీ రాజశేఖర్‌రాజు, హాలియా సీఐ రాఘవరావు భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు.

యువతి అదృశ్యం

నడిగూడెం: అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామంలో ఈ నెల 21న యువతి అదృశ్యమైంది. ఎస్ఐ అజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురవరం గ్రామానికి చెందిన మాదాసు ఉపేందర్ రెండో కుమార్తె మమత ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో మమత కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మమత తండ్రి ఉపేందర్ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దారితప్పి జనారణ్యంలోకి..

- అర్బన్ పార్కులో ఇటీవల 45జింకలను వదిలిన అధికారులు
- కంచె దాటుకుని బయటకు వస్తుండడంతో వాటిని వేటాడుతున్న వీధి కుక్కలు
- ఇప్పటికే రెండు జింకలు మృతి
- శుక్రవారం ఫైలాన్‌కాలనీలో పరుగులు పెట్టిన మరో జింక



ఇంట్లో దూరిన జింకను పట్టుకుంటున్న యువకులు

నాగార్జునసాగర్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో భాగమైన నాగార్జునసాగర్ కోర్ ఏరియాలో అడవిలో వదిలిన జింకలు జనారణ్యంలోకి వచ్చి వీధికుక్కల బారిన పడుతున్నాయి. సాగర్ తీరంలో నాగార్జునసాగర్-హైదరాబాద్ నల్లగొండ రహదారి వెంట ఏర్పాటు చేసిన అర్బన్ పార్కులో ఇటీవల సుమారుగా 45జింకలను వదిలారు. కేవలం రోడ్డు వెంట, పక్కన గల చేల వైపు మాత్రమే ముళ్ల కంచె వేశారు. వెనుక వైపు కేవలం కట్టెలు, కంపతో కంచె ఏర్పాటు చేశారు. దీంతో జింకలు వెనక వైపు నుంచి కంచెను దూకి బయటకు వెళ్తున్నాయి. ఈ నెల 8న, 22న దారితప్పిన జింకలను వీధికుక్కలు వెంటాడి చంపివేశాయి. మరో జింక శుక్రవారం ఉదయం నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్ కాలనీలో వీధుల వెంట పరుగులు పెట్టింది. యువకులు దానిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. ఒకరి ఇంట్లో దూరింది. ఫారెస్ట్ అధికారులకు ఫోన్‌చేయడంతో వారు వచ్చి తీసుకువెళ్లారు.

మిగిలిన జింకలు పదిలమేనా..

సుమారుగా 45 జింకలను అడవిలో వదలగా రెండు జింకలు జనారణ్యంలోకి వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్నాయి. మిగిలిన జింకలు పదిలంగా ఉన్నట్టా లేదా పక్కనగల గ్రామాల్లోకి వెళ్లినట్టా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. జింకలను కాపాడేందుకు ఫారెస్ట్ అధికారులు గత రెండు రోజులుగా అటవీ ప్రాంతం వెంటగల తండాలు, గ్రామాలకు వెళ్లి ఎక్కడైన జింకలు కనపడితే అటవీ అధికారులకు ఫోన్లు చేయాలని, వాటిని తాము వచ్చేంతవరకు కాపాడాలని మైకులో చెప్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. జింకలతో పాటు అడవి జంతువులు ఏవీ కనిపించినా సమాచారం ఇవ్వాలని వారు కోరుతున్నారు.